

సోమశిలలో 15.239 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 15.239 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,350 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.66,570
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,978
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,157
నవర (8 గ్రాములు)	రూ.49,257

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.4 /24.6

మంగళవారం గాలిలో తేమ 65 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. బుధవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిశీలకుడు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. చంద్రశేఖర్‌రెడ్డి నియామకం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసిన కాకాణి



విష్ణువర్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

అల్లూరు: మాజీ శాసనసభ్యుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని అల్లూరులోని ఆయన నివాసంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు తాజా రాజకీయ పరిణామాల గురించి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు అనుచరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం

నెల్లూరు(అర్బన్): చిన్నారుల్లో పోలియో రాకుండా ఉండేందుకు చేపట్టిన పల్స్ పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతమైంది. వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వేలో జిల్లాలో 5 ఏళ్లలోపు గల పిల్లలు 2,93,536 మంది ఉన్నట్టు తేలింది. వీరిలో తొలిరోజు ఆదివారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో 2,87,724 మందికి చుక్కలు మందు వేసి 98.02 శాతం పూర్తి చేశారు. రెండోరోజు సోమవారం 5,366 మందికి (1.83 శాతం), మూడో రోజు మంగళవారం 1,485 మంది (0.51శాతం) పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మూడు రోజులలో మొత్తం 100.36 శాతం మంది పిల్లలకు వ్యాక్సిన్ వేశారు.

పన్నుల వసూళ్లపై దృష్టి

- ఆర్థిక సంఘం కమిషన్ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న రత్నకుమారి

నెల్లూరు(పొగతోట): నూతన టెక్నాలజీని వినియోగించుకుని నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పన్నుల వసూళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐదో ఆర్థిక సంఘం కమిషన్ చైర్‌పర్సన్ ఎస్.రత్నకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని జెడ్పీ కార్యాలయంలో పన్నుల వసూళ్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని, పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేస్తే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలిపారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో వ్యాపార ప్రకటనలకు సంబంధించి వంద శాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు కృపాకర్‌రావు, పద్మారావు, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ బి.చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, డీఎల్‌పీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెలిగొండ కల సాకారం

- పూర్తయిన సొరంగాల తవ్వకాలు
- మరో హామీ నిలబెట్టుకున్న సీఎం జగన్
- జిల్లాలో 65 వేల ఎకరాలకు సాగునీరు
- 1.5 లక్షల మందికి తీరనున్న దాహార్తి
- వచ్చే సీజన్ నుంచి పొలాలకు నీరు
- నేడు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేయనున్న సీఎం

ఉదయగిరి: వెలిగొండ ప్రాజెక్టు.. ఇది మెట్ట ప్రాంత ప్రజల కల. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇది సాకారమైంది. గత ప్రభుత్వం పనులను గాలికొదిలి కేవలం కాంట్రాక్టర్లకు లబ్ధిచేకూర్చే ఆదాయ వనరుగా మార్చింది. జగన్ అధికారం చేపట్టిన వెంటనే వెలిగొండ నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చి పనులు వేగవంతం చేశారు. రెండు టన్నెల్స్‌ను రికార్డు స్థాయిలో పూర్తిచేసి నీటిని కాలువలకు విడుదల చేసేందుకు అవసరమైన ప్రక్రియ పూర్తిచేశారు.

43.58 టీఎంసీలు తరలించేలా..

కృష్ణానదిపై శ్రీశైలానికి 45 రోజులపాటు వరద వస్తుంది. ఆ సమయంలో రోజూ 11,582 క్యూసెక్కుల చొప్పున 48.58 టీఎంసీలను తరలించేలా రెండు టన్నెల్స్ తవ్వాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, దర్శి, కొండపి, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో 3.36 లక్షలు, నెల్లూరు జిల్లా ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో 65 వేలు, వైఎస్సార్ జిల్లా బద్వేలు నియోజకవర్గంలో 27,200 కలిపి మొత్తం 4.27 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు 1.5 లక్షల మంది దాహార్తి తీర్చాలని ప్రతిపాదనలు రూపొందించారు. ఈ పనుల నిర్వహణను మన జిల్లాలో ఎంఆర్‌కేఆర్, జెడ్‌పీఎస్ సంస్థలు దక్కించుకున్నాయి.

వేగంగా ప్రాజెక్టు పనులు

గత ప్రభుత్వ పాలనలో వెలిగొండ పనుల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. దీంతో పనులు నత్తనడకన సాగి నిర్మాణం వెనుకబడిపోయింది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వం ప్రాధాన్యతా ప్రాజెక్టుగా చేర్చి రివర్స్ టెండరింగ్ నిర్వహించింది. మొదటి టన్నెల్‌ను రికార్డుస్థాయిలో 3.6 కి.మీ పనిని 13 నెలల్లో పూర్తిచేసింది. రెండో టన్నెల్ పనులు కూడా 15 నెలల్లో పూర్తి చేశారు. వచ్చే సీజన్ నుంచి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతంలోని బీడుభూములు సస్యశ్యామలం కానున్నాయి.



పూర్తయిన టన్నెల్ పనులు


లబ్ధిపొందే ప్రాంతాలు

జిల్లా	నియోజకవర్గాలు	ఎకరాలు
నెల్లూరు	ఉదయగిరి, ఆత్మకూరు	65 వేలు
ప్రకాశం	యర్రగొండపాలెం, దర్శి, కొండపి, గిద్దలూరు, కనిగిరి	3.36 లక్షల ఎకరాలు
వైఎస్సార్	బద్వేలు	27,200

బీడు భూములకు జలకళ

వెలిగొండ ప్రాజెక్టు పడమటి కాలువ ద్వారా పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయరుకు 2.610 టీఎంసీల నీరు నిల్వ చేయనున్నారు. ఈ నీటితో ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని 65 వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలంగా మారనున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరి మండలంలో 11 వేలు, దుత్తలూరు మండలంలో 20 వేలు, వరికుంటపాడు మండలంలో 13 వేలు, ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో 21 వేల ఎకరాలకు సాగునీరు ఈ రిజర్వాయరు ద్వారా అందుతుంది. అంతేకాకుండా ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని 1.5 లక్షల మందికి సురక్షిత తాగునీరు కూడా సరఫరా చేయనున్నారు. దీని సొరంగం పనులు పూర్తికావడంతో కృష్ణా నదికి నీరు వచ్చిన వెంటనే రెండు సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు నీరు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. వచ్చే సీజన్‌లో ఉదయగిరి ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టు నీళ్లు రానున్నాయి.

నెరవేరిన మెట్టప్రాంత ప్రజల కల



వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చిరకాల వాంఛ. ఈ ప్రాజెక్టు పూర్తిచేసి ఉదయగిరిని సస్యశ్యామలం చేయాలని మా అన్న రాజమోహన్‌రెడ్డి నిరంతరం కల కనేవారు. వైఎస్సార్ హయాంలో పనులు శరవేగంగా జరిగినా, టీడీపీ ప్రభుత్వ హయాంలో మందగించాయి. ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రాధాన్యతా క్రమంలో ఉంచి ఫిబ్రవరి నాటికి సొరంగం పనులు పూర్తి చేయించారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయరు పనులు కూడా త్వరలో పూర్తికానున్నాయి. వచ్చే సీజన్‌లో రిజర్వాయరులో నీరు నిల్వ ఉంచి ఉదయగిరి, ఆత్మకూరు మెట్ట ప్రాంత భూములకు సాగునీరు అందనుంది. – రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త

ఫేక్ పోస్టులపై చర్యలు తీసుకోండి

- ఏఎస్పీకి వైఎస్సార్‌సీపీ నేతల వినతి



ఏఎస్పీ సౌజన్యకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఫేక్ పోస్టులు పెడుతున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పాతపాటి ప్రభాకర్, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ షహీద్‌అలీ, నాయకులు పఠాన్ అస్లామ్, శ్రీధర్, రామిరెడ్డి, వినోద్ తదితరులు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ మారుతున్నారని వారం రోజులుగా కొందరు టీడీపీ నేతలు ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో ఫేక్ పోస్టులు పెడుతున్నారని, తమ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరామన్నారు. ఇదే విషయమై దర్గామిట్ట, వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లలోనూ ఫిర్యాదు చేశామని తెలిపారు.

విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం పలుకుదాం

- ఎంపీ ఆదాల, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డిని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించిన తరువాత తొలిసారిగా ఆయన బుధవారం జిల్లాకు విచ్చేస్తున్న నేపథ్యంలో ఘన స్వాగతం పలుకుదామని నెల్లూరు ఎంపీ, పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎంపీ ఆదాల మాట్లాడారు. ఆవిర్భావం నుంచి పార్టీని విజయ పథంలో నడిచేలా కృషి చేసిన వ్యక్తుల్లో విజయసాయిరెడ్డి ముఖ్యులన్నారు. ఆయన నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయనుండడంపై జిల్లావాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ విజయసాయిరెడ్డికి పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం కందుకూరు నియోజకవర్గ పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధులు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు కావలి సమీపంలోని రుద్రకోట వద్ద, దగదర్తి సమీపంలో ఆత్మకూరు నియోజకవర్గం వారు, రాజుపాళెం వద్ద కోవూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు స్వాగతం పలుకుతారని తెలిపారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల నాయకులు అయ్యప్పగుడి సమీపంలో స్వాగతం పలికిన అనంతరం అక్కడి నుంచి ఆత్మకూరు బస్టాండ్, మినీబైపాస్ మీదుగా రామ్మూర్తినగర్‌లో ఉన్న క్యాంపు కార్యాలయానికి ఆయన చేరుకుంటారని తెలిపారు. ఈ మార్గంలో ఉన్న మహాత్ముల విగ్రహాలకు ఆయన నివాళులర్పిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ స్వాగత కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉందని మరోసారి నిరూపిస్తామన్నారు. సమావేశంలో నగర మేయర్ పొట్లూరు స్రవంతి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి, ఇంకా మన్నెమాల సుకుమార్‌రెడ్డి, పేర్నేటి కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో చంద్రశేఖర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్ నాయకులు

నైపుణ్య కేంద్రాలతో ఉజ్వల భవిష్యత్

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(టౌన్): రాష్ట్రవ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలతో యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభించనుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. మంగళవారం విశాఖపట్నం నుంచి నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన నైపుణ్య శిక్షణ కేంద్రం భవనాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 10 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను సీఎం ఒకేసారి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నిరుద్యోగ యువత, విద్యార్థులకు వివిధ కోర్సుల్లో వృత్తి నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి సమాజంలో వారికి గుర్తింపు తీసుకురావడమే ప్రధాన ఉద్దేశమన్నారు. స్థానిక వెంకటేశ్వరపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఎంపీ సురేష్‌ప్రభు రూ.70 లక్షల నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వినీల్‌కుమార్, ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ శ్యాంసన్, ప్రిన్సిపల్ రాజగోపాల్‌రెడ్డి, ఎలక్ట్రానిక్స్ హెడ్ శివకుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు

- కలెక్టర్ హరినారాయణన్

వెంకటాచలం: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఈవీఎంలను భద్రపరచడం, పోలీసు బందోబస్తు, సిబ్బంది శిక్షణ, వసతి సౌకర్యాలు, పార్కింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల కోసం వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాలలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు సంబంధించి వెంకటాచలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి గదిని కలెక్టర్ తొలుత పరిశీలించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని, తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు దరఖాస్తులను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు, ఈవీఎంల భద్రత తదితర అంశాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలిచ్చామని తెలిపారు. ఆయన వెంట సర్వేపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు, ఎంపీడీఓ ముజీబున్నీసా, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఆర్ఐ రవి తదితరులు ఉన్నారు.



అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

పొగాకు ధరలపై రైతుల ఆశలు

- నేటి నుంచి వేలం

కందుకూరు: 2023–24 పంట సీజన్‌కు సంబంధించి పొగాకు వేలం ప్రక్రియ బుధవారం ప్రారంభం కానుంది. జిల్లాలో మొదటి విడతలో కందుకూరులోని రెండు వేలం కేంద్రాల్లో పొగాకు వేలం ప్రారంభించనున్నారు. ఇప్పటికే బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలో ఉన్న ప్రకాశం జిల్లా కొండపి, ఒంగోలు–1 కేంద్రాల్లో గత నెల 29న వేలం ప్రారంభించారు. మలి విడతలో భాగంగా బుధవారం కందుకూరు–1, కందుకూరు–2, కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాల్లో పొగాకు వేలం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పొగాకు ధరలు ఏ విధంగా ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ప్రారంభమైన కొండపి, ఒంగోలు వేలం కేంద్రాల్లో బ్రైట్ గ్రేడ్ కేజీ పొగాకు ధర రూ.230 వరకు పలుకుతోంది. అయితే ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో సాగు ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో ధరలు కూడా పెంచాల్సిన అవసరం ఉందని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సరాసరి ధర రూ.250 తగ్గకుండా ఇవ్వాలంటున్నారు. అయితే వేలం ప్రారంభంలో ప్రస్తుతం కేజీ రూ.230 ధర వద్ద వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వేలం సాగే కొద్దీ ధరలు పెరుగుతాయనే భావాన్ని వ్యక్తం చేస్తున్నారు.



పొగాకు బేళ్లు

98.85 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ పూర్తయింది. మంగళవారం నాటికి 98.85 శాతం మంది లబ్ధిదారులకు కానుక నగదు అందజేశారు. 3,17,719 మందికి గాను 3,14,051 మందికి పంపిణీ చేశారు.

రేపు మీడియా వర్క్‌షాప్

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్లకు మీడియా పరమైన సూచనలు, నిబంధనలపై కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో మీడియా వర్క్‌షాపు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.సదారావు మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ సమావేశానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

క్లుప్తంగా

రేషన్ షాపులో విజిలెన్స్ తనిఖీలు



స్టాక్‌ను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): రేషన్ షాపులో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. నిల్వల్లో భారీ వ్యత్యాసం ఉండటంతో డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నెల్లూరు చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు విరాట్‌నగర్‌లోని 49వ నంబర్ రేషన్ షాపులో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సి.మాణిక్యరావు, నెల్లూరు అర్బన్ పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రికార్డుల ప్రకారం షాపులో 37,121 కేజీల బియ్యం ఉండాల్సి ఉండగా కేవలం 150 కేజీలు మాత్రమే ఉండడాన్ని గుర్తించారు. మిగిలిన బియ్యం ఎక్కడని డీలర్‌ను ప్రశ్నించారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో సదరు డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వలేటివారిపాలెం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని శాఖవరంలో జరిగింది. పోలీసులు మంగళవారం వివరాలు వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి శాఖవరం గ్రామానికి చెందిన చుంచు శివకృష్ణ (34) మృతదేహం శాఖవరం ఎస్సీ కాలనీలో గడ్డం గోవిందమ్మ అనే మహిళ ఇంటి ముందు ఉన్న రోడ్డుపై కనిపించింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లి వెంకటరవణమ్మ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై బాజీబాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

నిబంధనల ప్రకారం పోస్టల్ బ్యాలెట్

• డ్వామా పీడీ వెంకట్రావ్



మాట్లాడుతున్న పీడీలు

నెల్లూరు(పొగతోట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నిబంధనల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ వెంకట్రావ్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావు ఆదేశించారు. నెల్లూరులోని డ్వామా కార్యాలయంలో మంగళవారం ఏపీఓలు, ఈసీలతో నిర్వహించిన సమావేశంలో పీడీలు మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ అందజేయడం, వినియోగంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే జాప్యం చేయకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:132
లేయర్ (లైవ్)	:70
బ్రాయిలర్ చికెన్	:232
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:258
లేయర్ చికెన్	:120

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	:రూ.80
సన్నవి	:రూ.65
పండ్లు	:రూ.27

ఎన్‌ఆర్‌సీల్లో చిన్నారులకు పౌష్టికాహారం

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్ (ఎన్‌ఆర్‌సీ) ద్వారా ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఉన్న సెంటర్‌లో రూ.35 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిని మంగళవారం ఎంపీ ఆదాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నారని చెప్పారు. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న, తగిన బరువు లేని చిన్నారుల కోసం ఈ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇక్కడ చేర్చే బిడ్డలకు పౌష్టికాహారంతో పాటు సహాయకునికి రోజుకు రూ.100 అందిస్తారన్నారు. ఏసీ, వేడినీరు, పిల్లల ఆట పరికరాలు తదితర సదుపాయాలు ఇక్కడ ఉన్నాయన్నారు. పెద్దాస్పత్రి అభివృద్ధిపై దృష్టి సారించాలని సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌ను ఆదేశించారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌డీఎస్ కో–ఆర్డినేటర్ లక్ష్మీసునంద, ఏడీ డాక్టర్ కళారాణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ సుధాకర్‌గౌడ్, డీఈ సాంబశివరావు, ఏఈలు గోపిరెడ్డి, అనిల్‌కుమార్, డాక్టర్లు పాల్గొన్నారు.



ఆదాల సమక్షంలో ఎన్‌ఆర్‌సీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న లక్ష్మీసునంద

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని వవ్వేరు గ్రామానికి చెందిన 60 మంది టీడీపీ కార్యకర్తలు మంగళవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగింది. వారికి ప్రసన్న పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని వివరించారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

‘సిద్ధం’ సభను జయప్రదం చేద్దాం

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మేదరమెట్ల హైవే సమీపంలో ఈనెల 10వ తేదీన జరిగే సిద్ధం సభను అందరం కలిసి జయప్రదం చేద్దామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం సభకు సంబంధించిన ప్రచార సామగ్రి, స్టిక్కర్లను జేసీఎస్ కన్వీనర్లకు ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి ఎక్కువ మంది సభకు తరలివచ్చేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మర్రిపాడు మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, ఐవీ రమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కె.కిశోర్, కౌన్సిలర్లు సీహెచ్ కామాక్షయ్య నాయుడు, ఎం.రాజశేఖర్, కలాం, వెంకటరమణ, తోడేటి మణి పాల్గొన్నారు.



ప్రచార సామగ్రి అందజేసిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: ప్రభుత్వంపై టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలను వివరించాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. దుత్తలూరులోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వరికుంటపాడు, దుత్తలూరు మండలాల బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు ఫ్యాన్ గుర్తుపై ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సభ్యులు ప్రతి కుటుంబంతో మమేకమై ప్రభుత్వ పథకాలను వివరించడంతోపాటు వారి సమస్యలను వినాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన లబ్ధిని వివరించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. చంద్రబాబు నాయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యత్యాసాన్ని ప్రతి ఇంటికీ వివరించాలన్నారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల కన్వీనర్లు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, తిరుపతినాయుడు, కమ్మవారిపాళెం సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్య చౌదరి, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, వరికుంటపాడు సొసైటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఆర్సీ.H1.60/2024 తేది: 05.03.2024

షార్ట్ టెండరు నోటీసు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పార్లమెంటరీ మరియు అసెంబ్లీ నియోజకవర్గములకు ఏప్రిల్ / మే మాసము 2024న జరుగు సార్వత్రిక ఎన్నికల కొరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో MOCK Poll/VVPAT Slips భద్రపరుచుటకు స్పెసిఫికేషన్ ప్రకారం ప్లాస్టిక్ బాక్స్‌లు సరఫరా చేయుటకు ఏజెన్సీల నుండి సీల్డు టెండరు కోరబడుచున్నవి. షార్ట్ టెండర్ ఫారం కార్యాలయము పని దినాలలో శ్రీయుత సహాయ మార్కెటింగ్ సంచాలకులు, మద్రాసు బస్టాండు, నెల్లూరు వద్ద రూ.500/- చెల్లించి తీసుకొనగలరు.

1. ధరావత్తు మొత్తము EMD	రూ. 1,00,000/-
2. బయానా చెల్లించవలసినది.	జిల్లా కలెక్టరు నెల్లూరు పేరున తీసిన డిమాండ్ డ్రాఫ్ట్
3. బిడ్ డాక్యుమెంట్ విక్రయ ప్రారంభ తేది	06.03.2024
4. బిడ్ డాక్యుమెంట్ విక్రయ ముగింపు తేది	08.03.2024 2:00 PM
5. బిడ్స్ స్వీకరణ చివరితేది మరియు సమయం	08.03.2024 4:00 PM
6. టెండరు తెరుచు తేది మరియు సమయం	09.03.2024 11:00 AM
7. టెండరు తెరుచు ప్రదేశము	సంయుక్త కలెక్టర్ చాంబర్

క్ర. సం.	ఐటములు	అంచనా యూనిట్ అవసరమైన పరిమాణం (సుమారుగా)	GSTమరియు పన్నులు మినహా ఒక ఒక యూనిట్ ధర	అంచనా పరిమాణం GST మినహా మొత్తం వ్యయం	మొత్తం వ్యయంపై విధించ బడనున్న GST
1	నకోడ కంపెనీ ప్లాస్టిక్ బాక్స్‌లు పొ14 xవె10x ఎ5 (అంగుళాలు)	5400			

సం/- సంయుక్త కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

మహిళలకు అండగా జగనన్న ప్రభుత్వం

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళలకు అన్నివిధాలుగా అండగా ఉందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలో స్వయం సహాయక సభ్యుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మార్ట్ నిర్వహణ కోసం తన వంతుగా రూ.5 లక్షల విరాళం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

తెలుగుదేశం పార్టీని నమ్మొద్దు

• సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ‘తెలుగుదేశంను ఎవరూ నమ్మొద్దు. హామీలిచ్చి మోసం చేయడమే ఆ పార్టీ నాయకులకు తెలుసు’ అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఎండీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. నగరంలోని 8వ డివిజన్ కుమ్మరి వీధి, బలిజ వీధి, అలాగే 48వ డివిజన్ పొర్లుకట్ట, ఉయ్యాల కాలువ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పేరుతో నెల్లూరులో ఇష్టానుసారంగా రోడ్లు తవ్వేశారన్నారు. నాలుగున్నరేళ్ల ఎవరికీ కనిపించని టీడీపీ నాయకులు ఎన్నికల నేపథ్యంలో ఏవేవో హామీలు ఇస్తున్నారని, ప్రజలెవరూ నమ్మవద్దని కోరారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సిటీలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కామాక్షీదేవి, 48వ డివిజన్ ఇన్‌చార్జి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్ధిఖ్, నాయకులు దొంతాల రఘు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్ అహ్మద్

టెండర్ల ఆహ్వానం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు మూలాపేటలోని ఏపీ స్టార్స్‌లో జైళ్ల శాఖ సిబ్బందికి 2024–25 ఆర్థిక సంవత్సరంలో భోజన సదుపాయం కల్పించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ స్టార్స్ ప్రిన్సిపల్ ఎస్.రాజారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు ఈనెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు రూ.112 చెల్లించి టెండర్ ఫారాలను పొందవచ్చన్నారు. డిపాజిట్ కింద రూ.37,140లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి చేసిన ఫారాలను ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు సీల్డ్ కవర్‌లో సమర్పించాలన్నారు. అదేరోజు టెండర్‌లు తెరుస్తామని తెలిపారు. పూర్తి డైట్ మెనూ/షెడ్యూల్‌ను ఏపీ స్టార్స్‌లో పొందవచ్చని రాజారావు తెలియజేశారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బాలికపై లైంగికదాడి చేశాడని నమోదైన కేసులో ఓ వ్యక్తిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఓ బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులందరూ బయటకు వెళ్లారు. ఈ క్రమంలో వైఎస్సార్ నగర్‌కు చెందిన గురవయ్య బాలికపై లైంగికదాడి చేశాడు. అతను భయపెట్టడంతో ఆమె ఎవరికీ చెప్పలేదు. నిందితుడు మూడురోజులుగా బాలిక వెంట పడుతుండడంతో జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై మంగళవారం పోక్సో కేసు నమోదైంది.

సోమిరెడ్డీ.. వాళ్లు టీడీపీ నాయకులే..

- వైఎస్సార్‌సీపీ నాయకుల ఇసుక తవ్వకాలంటూ ఫిర్యాదు
- నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు
- ఆ వాహనాలు తెలుగు తమ్ముళ్లవే..

వెంకటాచలం: వైఎస్సార్‌సీపీపై తప్పుడు ప్రచారం చేయాలని చూసిన ప్రతిసారి టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురవుతోంది. గత నెల 29వ తేదీన రాత్రి మండలంలోని గుడ్లూరువారిపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని సోమిరెడ్డి సీఐ అంకమరావుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అధికార పార్టీ నాయకులకు ఊడిగం చేస్తారా అంటూ ఆయనపై తీవ్రస్థాయిలో దూషణలకు పాల్పడినట్లు సమాచారం. సీఐ తన సిబ్బందితో ఇసుక తవ్వకాలు చేస్తున్న ప్రాంతానికి వెళ్లారు. నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇసుక అక్రమ తవ్వకాలంటూ రచ్చ చేసిన సోమిరెడ్డి శుక్రవారం ఉదయం సీఐకి ఫోన్ చేసి మీరు పట్టుకున్న ట్రాక్టర్లు మా పార్టీ వారివే వదిలేయండని ప్రాధేయపడ్డారు. ప్రతి విషయాన్ని వైఎస్సార్‌సీపీ వర్గీయులకు అంటగట్టాలని చూడడం సోమిరెడ్డికి అలవాటైపోయింది. తీరా అంతా చేసింది తెలుగు తమ్ముళ్లేనని తేలుతుండడంతో భంగపాటుకు గురవుతున్నారు. ట్రాక్టర్లను పట్టించింది సోమిరెడ్డేనని తెలియడంతో ఆ గ్రామ టీడీపీ నాయకులు భగ్గుమంటున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న టీడీపీ నాయకుల ట్రాక్టర్లు

సోమిరెడ్డి ఫిర్యాదుతోనే..

గుడ్లూరువారిపాళెంలో అక్రమంగా ఇసుక తవ్వుతున్నారని సోమిరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామానికి వెళ్లి దాడులు చేసి నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశాం.

– అంకమరావు, సీఐ

మద్యం అనధికార విక్రయాలపై దాడులు

• 150 బాటిళ్ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): మద్యం అనధికార విక్రయాలపై మంగళవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశారు. 150 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకులతోపాటు ప్రభుత్వ మద్యం దుకాణ సూపర్‌వైజర్‌ను అరెస్ట్ చేశారు. ఎస్‌ఈబీ నెల్లూరు–1 ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయభాస్కర్‌రావు నెల్లూరులోని తన కార్యాలయంలో దాడుల వివరాలను వెల్లడించారు. ఇరుగాళమ్మ సంఘం సమీపంలోని రాజీవ్ గృహకల్పకు చెందిన లక్ష్మి స్థానికంగా కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్నారు. ఆమెకు పొట్టేపాళెం గ్రామానికి చెందిన శ్రావణ్ బంధువు. వారు కొంతకాలంగా అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. కొండ్లపూడి గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణ సేల్స్‌మెన్ రమేష్‌తో పరిచయమైంది. అతడి సహకారంతో పెద్దఎత్తున మద్యంను కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. దీనిపై ఎస్‌ఈబీ నెల్లూరు–1 ఇన్‌స్పెక్టర్‌కు పక్కా సమాచారం అందింది. మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి లక్ష్మి ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 150 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మి, శ్రావణ్, రమేష్‌ను అరెస్ట్ చేశారు. అనధికార మద్యం విక్రయాలు, అక్రమ నిల్వలను గుర్తిస్తే డయల్ 14500, 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.బాబు శ్రీధర్ అభినందించారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న బాటిళ్లతో ఎస్‌ఈబీ అధికారులు